నేడు నేత్ర, రక్తదాన శిబిరం

నల్లకుంట: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సక్షమ్ తెలంగాణ ఆధ్వర్యంలో శనివారం(నేడు) నేత్ర, రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు గోల్నాక తులసీ నగర్ పార్కులో శిబిరం ప్రారంభమవుతుందన్నారు. సంస్థ ఆధ్వర్యంలో గత రెండేళ్లుగా తులసీనగర్‌లో దివ్యాంగ చిన్నారులకు ఉచిత ఫిజియో థెరపీ, స్పీచ్ థెరపి, బిహేవియర్ థెరపి శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సేవా భావం కలిగిన వారు ఈ శిబిరంలో పాల్గొనాలని కోరారు.

9న సత్యనారాయణ స్వామి కల్యాణోత్సవం



కాచిగూడ: శ్రీ ఆంజనేయ సేవా సమితి 8వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ఈ నెల 9న అన్నవరం సత్యనారాయణ స్వామి వారి కల్యాణోత్సవం, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తున్నట్లు సమితి సంయోజకులు డీఆర్ఎస్ నరేంద్ర తెలిపారు. శుక్రవారం కాచిగూడ, నింబోలి అడ్డ శ్రీ సరస్వతి శిశుమందిర్ ప్రాంగణంలో గణపతి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం పోస్టర్‌ను బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు ఆవిష్కరించారు. ఎనిమిదేళ్లుగా శ్రీ ఆంజనేయ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్పొరేటర్లు కన్నె ఉమా రమేష్ యాదవ్, వై.అమృత, బీజేపీ నేతలు శ్యాంరాజ్, రమేష్ యాదవ్, ఆనంద్‌గౌడ్, అచ్చిని మహేష్, చుక్కా జగన్, జాటోతు పవన్, గుండగోని నరేందర్, రాజేందర్ పాల్గొన్నారు.

చివరి నిమిషంలో ఓటెత్తిన యువత

- ముషీరాబాద్‌లో 50.50 శాతం పోలింగ్
- భోలక్‌పూర్ డివిజన్‌లో 60 శాతం పైగా నమోదు
- అత్యల్పంగా బాగ్‌లింగంపల్లిలోని 207 బూత్‌లో 29 శాతం

ముషీరాబాద్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గురువారం సాయంత్రం పోలింగ్ ముగిసే సమయానికి ముషీరాబాద్ నియోజకవర్గంలో ఓటు వేసేందుకు యువత పోటెత్తారు. ఏ పోలింగ్ బూత్‌లో ఎంత మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు అనే దానిపై రిటర్నింగ్ అధికారులు శుక్రవారం తుది జాబితాను విడుదల చేశారు. మహిళలు, పురుషులు ఏ బూత్‌లో ఎంతమంది ఓటింగ్‌లో పాల్గొన్నారు అనే దానిపై స్పష్టత ఇచ్చారు. నియోజకవర్గంలో 3,01,788 మంది ఓటర్లు ఉండగా అందులో పురుష ఓటర్లు 1,55,168 మంది, మహిళా ఓటర్లు 1,46,607 మంది, ట్రాన్స్‌జెండర్లు 13 మంది ఉన్నారు. గురువారం జరిగిన ఎన్నికల్లో పురుషులు 78,685 మంది, మహిళా ఓటర్లు 73,863 మంది, ట్రాన్స్‌జెండర్స్ ముగ్గురు ఓటు హక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో ఓటరు హక్కు వినియోగించుకున్న వారి మొత్తం ఓటు సంఖ్య 1,52,551 ఉంది. పోలింగ్ 50.549 శాతం అయింది.

భోలక్‌పూర్‌లో అత్యధిక శాతం ఓటింగ్...

అత్యధికంగా భోలక్‌పూర్ డివిజన్‌లోని ఇందిరానగర్‌లో గల సెట్‌విన్ భవన్‌లో ఉన్న పోలింగ్ బూత్ 113లో 66.285 పోలింగ్ శాతం నమోదు కావడం గమనార్హం. 266 పోలింగ్ బూత్‌లో 64.265, 112వ బూత్‌లో 63.755, 121, 121ఏ బూత్‌లలో 62 శాతం, 180 పోలింగ్ బూత్‌లో 61.7 శాతం, 104 పోలింగ్ బూత్‌లో 64.01, 105ఏ బూత్‌లో 62.549 శాతం, 106 బూత్‌లో 61.065 శాతం, 34 పోలింగ్ బూత్‌లో 61.244 శాతం, 43 బూత్‌లో 61.345 శాతం, 87 బూత్‌లో 62.613 శాతం, 116 బూత్‌లో 60.51 శాతం పోలింగ్ నమోదైంది. ఈ పోలింగ్ బూత్‌లన్నీ భోలక్‌పూర్ డివిజన్‌లోనివే కావడం, అత్యధికంగా ఈ డివిజన్‌లోనే పోలింగ్ నమోదు కావడం పట్ల ప్రధాన పార్టీల అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓటర్లు ఎవరి వైపు మొగ్గు చూపారో అని ఆరా తీస్తున్నారు.



అత్యల్పంగా 29 శాతం పోలింగ్...

రాంనగర్ డివిజన్‌లోని రాజీవ్‌నగర్ జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హాల్‌లో గల 207 పోలింగ్ బూత్‌లో అత్యల్పంగా పోలింగ్ శాతం నమోదైంది. ఇక్కడ 885 మంది ఓటర్లు ఉండగా కేవలం 262 మంది మాత్రమే అంటే 29.605 శాతం మాత్రమే పోలింగ్‌లో పాల్గొన్నారు. 5వ నెంబర్ పోలింగ్ బూత్‌లో 793 మంది ఓటర్లు ఉండగా కేవలం 242 మంది అంటే 3051 శాతం పోలింగ్‌లో పాల్గొన్నారు. 133 పోలింగ్ బూత్‌లో 34.73 శాతం, 132 పోలింగ్ బూత్‌లో 34.659 శాతం నమోదు కావడం గమనార్హం.

పోలింగ్ సరళి ఇలా...

పోలింగ్ శాతం ఇలా..
ఉదయం 9 గంటలకు–7.12
ఉదయం 11 గంటలకు–14.83
మధ్యాహ్నం 1 గంటలకు– 24.06
మధ్యాహ్నం 3 గంటలకు– 34.30
సాయంత్రం 5 గంటలకు – 40.69
పోలింగ్ ముగిసిన అనంతరం 52.50
మొత్తం ఓటర్లు – 277103
పురుషులు –140206
మహిళలు– 136883
ఇతరులు–14
పోలైన ఓట్లు మొత్తం– 145470
పురుషులు – 73534
మహిళలు – 71934
ఇతరులు -2

అంబర్‌పేట్‌లో అంతుపట్టని పోలింగ్ సరళి

- సాయంత్రం భారీగా నమోదైన పోలింగ్
- 52.50 శాతం నమోదు

అంబర్‌పేట్: అంబర్‌పేట నియోజకవర్గంలో నమోదైన పోలింగ్ శాతం ఉత్కంఠంగా మారింది. నియోజకవర్గంలో తుది పోలింగ్ 52.50 గా నమోదైంది. దీంతో విశ్లేషకులతో పాటు అభ్యర్థుల అంచనాలకు సైతం ఫలితాలు అంతు చిక్కడం లేదు. గురువారం ఉదయం మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గంటలకు ఓటర్లు బారులు తీరారు. సమయం ముగిసినా పోలింగ్ కేంద్రాల్లో భారీగా క్యూలైన్‌లు కనిపించాయి. దీంతో దాదాపు రాత్రి 8 గంటల వరకు పోలింగ్ కొనసాగించాల్సి రావడంతో అధికారులు పోలింగ్ వివరాలను వెల్లడించలేకపోయారు. శుక్రవారం ఉదయం 52.50 గా నమోదైనట్లు వెల్లడించారు.

పోలింగ్ సరళిపై కూడికలు, తీసివేతలు...

పోలింగ్ సరళిపై అభ్యర్థులు ఎవరి లెక్కల్లో వారు మునిగి తేలుతున్నారు. శుక్రవారం ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు పలువురు రాజకీయ విశ్లేషకులు గెలుపు ఓటములపై ప్రత్యేక కసరత్తు చేస్తున్నారు. ఉదయం పడిన ఓట్లు ఎవరికి, మధ్యాహ్నం పడ్డ ఓట్లు ఎవరికి, సాయంత్రం పడ్డ ఓట్లు మాకంటే మాకే అని ఆయా పార్టీల అభ్యర్థులతో పాటు నేతలు అంచనాలు వేస్తున్నారు. 5 గంటల వరకు 40 శాతం పోలింగ్ నమోదు కాగా సాయంత్రానికి పోలింగ్ కేంద్రాల్లో ఉన్నవారు వేసిన ఓట్లు ఏకంగా 10 శాతం నమోదు కావడం గమనార్హం. దీంతో చివరి నిమిషంలో వేసిన ఓట్లపై ఉత్కంఠ నెలకొంది.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే...

పోలింగ్ సరళిపై బీఆర్ఎస్ ధీమాగా ఉంది. పార్టీ బలంగా ఉన్న అంబర్‌పేట, గోల్నాక డివిజన్‌లలో పోలింగ్ శాతం పెరిగిందని ఇక గెలుపు తమదేనని ఆ పార్టీ నేతలు పేర్కొంటున్నారు. బీజేపీ సహితం తమ పార్టీకి పట్టు ఉన్న కాచిగూడ, నల్లకుంట డివిజన్‌లలో జరిగిన పోలింగ్‌తో గట్టెక్కుతామని భావిస్తున్నారు. అన్ని డివిజన్లలో సైలెంట్ ఓటింగ్ జరిగిందని అదే తమను గెలుపిస్తుందని కాంగ్రెస్ ధీమాగా ఉంది.

ఎవరి లెక్కలు వారివి...

- తగ్గిన పోలింగ్‌పై ఆందోళన
- ఎగ్జిట్ పోల్స్‌పై చర్చోపచర్చలు





ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలో ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తాడనే దానిపై తర్జన భర్జనలు జరుగుతున్నాయి. ఎగ్జిట్ పోల్స్‌పై కూడా ఎక్కడ చూసినా చర్చలు, వాదోపవాదాలు, వాగ్వివాదాలు, బెట్టింగ్‌లు చోటు చేసుకుంటున్నాయి. తగ్గిన పోలింగ్ ఎవరికి అనుకూలం, ఎవరికి వ్యతిరేకం అనే దానిపై కూడా ఆయా పార్టీల అభ్యర్థులు ఆరా తీస్తున్నారు. ఇక ఎన్నికల రిటర్నింగ్ అధికారి బూత్‌స్థాయిలో ఇచ్చిన పోలింగ్ సరళిపై కూడా ఆయా పార్టీల అభ్యర్థులు లెక్కలు వేస్తున్నారు. నియోజకవర్గంలో 1.18 లక్షల మంది ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందుకుంటున్నారని వారిలో సగం ఓట్లు తనకే పడతాయని, దీంతో తమ విజయం ఖాయమని అధికార బీఆర్ఎస్ నేతలు ధీమాగా ఉన్నారు. తమ అంచనాలకు తగ్గట్లు లబ్ధిదారులు పోలింగ్ బూత్‌లకు వచ్చి ఓట్లు వేశారని నమ్మకంతో ఉన్నారు. ఇక కాంగ్రెస్ పార్టీ మైనార్టీ ఓట్లను అంతగా చీల్చలేకపోయిందని అక్కడ కూడా తమకు మెజార్టీ వచ్చే అవకాశం ఉందని చెప్పుకుంటున్నారు. దీనికి తోడు ఎమ్మెల్యే ముఠా గోపాల్ మీద సానుకూలత ఉండడంతో ప్రభుత్వం మీద ఉన్న వ్యతిరేకతకు ఇది తోడైందని చెబుతున్నారు. దీంతో తక్కువ మెజార్టీతోనైనా గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

వ్యతిరేకతపై కాంగ్రెస్ ఆశలు

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ వ్యతిరేక గాలి ముషీరాబాద్‌లోనూ వీచిందని ఆ గాలిలో బీఆర్ఎస్ అభ్యర్థి కొట్టుకుపోతారని కాంగ్రెస్ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. ముస్లిలు అధికంగా నివసించే భోలక్‌పూర్, రిసాల, పటాన్ బస్తీ, అడిక్‌మెట్ తదితర ప్రాంతాల్లో అత్యధిక పోలింగ్ నమోదైందని అది తమకే అనుకూలమని లెక్కలు వేస్తున్నారు. దీనికి తోడు ప్రభుత్వ ఉద్యోగులు, నిరుద్యోగులు, మైనార్టీలతో పాటు తెలంగాణ జనసమితి, షర్మిల పార్టీ, సెక్యులర్స్, తెలుగు దేశం అభిమానులందరూ కాంగ్రెస్‌కే మొగ్గు చూపారని భావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అంజన్, అతడి ఇద్దరు కుమారులు శక్తివంచన లేకుండా కృషి చేశారని ఇది కూడా తమకు కలిసి వస్తుందని చెప్పుకొస్తున్నారు.

హిందూ ఓట్ బ్యాంక్‌పై నమ్మకం

ఇక బీజేపీ నేతలు మాత్రం సైలెంట్ ఓటింగ్ తమకే పడిందని భావిస్తున్నారు. క్రిస్టియన్, మైనార్టీ ఓట్లను కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు చీల్చుకోవడంతో తమ హిందూ ఓటు బ్యాంకుతో తప్పకుండా విజయం సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు యువకులు, అపార్ట్‌మెంట్ వాసులు, నరేంద్రమోదీ రోడ్ షో, జేపి నడ్డా, ఇతర బీజేపీ అగ్రనేతల ప్రచారాలు తమకు అనుకూలంగా ఉన్నాయని బీసీ నినాదం, ఎస్సీ వర్గీకరణ అంశం కూడా తమకు కలిసి వచ్చే అంశాలని లెక్కలు వేస్తున్నారు.

ఎర్రం నర్సింగ్‌రావుకు నివాళి



ఎర్రం నర్సింగ్‌రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టిడబ్ల్యూజేఎఫ్, హెచ్‌యూజే సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీనియర్ జర్నలిస్టు ఎర్రం నర్సింగ్‌రావు సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బసవపున్నయ్య మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటం చేసిన వ్యక్తి నర్సింగ్‌రావు అన్నారు. కార్యక్రమంలో పల్లె రవికుమార్, ఆంజనేయులు, అరుణ్‌కుమార్, జగదీష్, చంద్రశేఖర్, పి.రామచందర్, పద్మరాజు, నాగవాణి, నర్సింగ్‌రావు కుమార్తె డాక్టర్ రూప తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత ఈశ్వరీబాయి



ఈశ్వరీబాయికి నివాళులర్పిస్తున్న నాయకులు

లిబర్టీ: దళితుల అభ్యున్నతి కోసం ఈశ్వరీబాయి జీవితాంతం శ్రమించారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ అన్నారు. ఈశ్వరీబాయిని స్ఫూర్తిగా తీసుకొని దళిత బహుజనులు తమ హక్కుల కోసం పోరాటం సాగించాలని కోరారు. ఈశ్వరీబాయి జయంతిని శుక్రవారం మాల మహానాడు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమంలో ఈశ్వరీబాయి కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. కౌన్సిలర్‌గా, ఎమ్మెల్యేగా అణగారిన వర్గాల కోసం దళితుల కోసం కృషి చేశారని గుర్తు చేశారు.

మహిళల సమస్యల పరిష్కారానికి కృషి



నియామకపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

లిబర్టీ: దళిత బహుజన పార్టీ గ్రేటర్ హైదరాబాద్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా బండారు లావణ్య నియమితులయ్యారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ పార్టీ కార్యాలయంలో నియామకపత్రాన్ని అందజేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రజలు ముఖ్యంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం జీవన స్థితిగతుల్లో మార్పు కోసం అంబేద్కర్ స్ఫూర్తితో బలమైన పోరాటాలు చేస్తారని ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

కానిస్టేబుల్ కిష్టయ్యకు నివాళి



కాచిగూడ: తెలంగాణ తొలి అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య జయంతి సందర్భంగా తెలంగాణ మన ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నారాయణగూడలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ కిష్టయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు చొప్పరి శంకర్, వెంకటేశ్వర్లు, పిట్ల నాగేష్, శ్రీనివాసరాజు, సంపత్, సతీష్, నర్సింగ్, వరుణ్ తేజ్ తదితరులు పాల్గొన్నారు.

యువతికి అరుదైన శస్త్రచికిత్స

గొంతులోని చీముగడ్డను తొలగించిన ఈఎన్‌టీ వైద్యులు



శస్త్రచికిత్స చేసిన ఈఎన్‌టీ వైద్య బృందం

సుల్తాన్‌బజార్: గొంతులో చీముగడ్డ తొలగించి ఓ యువతి ప్రాణాలను కోఠి ఈఎన్టీ ఆస్పత్రి వైద్యులు కాపాడారు. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం దొమ్మాట గ్రామానికి చెందిన శృతి (15) కొంతకాలంగా గొంతులో ఏమీ మింగకుండా బాధపడుతుండేది. గత నెల 28న రాత్రి 11 గంటలకు కోఠి ఈఎన్టీ ఆస్పత్రికి రావడంతో ఈఎన్టీ వైద్యులు ఆమెను అడ్మిట్ చేసుకుని 29న సిటీ స్కాన్‌తో పాటు అన్ని రకాల రక్తపరీక్షలు నిర్వహించారు. గొంతులో ఒక పెద్ద చీముగడ్డ ఉన్నట్లుగా తేలడంతో గొంతు వెనుకభాగం నుంచి ఛాతి పైభాగానికి కూడా విస్తరించినట్లు గుర్తించారు. ఆలస్యం చేస్తే ఈ చీముగడ్డ మరింత పెరిగి శ్వాసనాళానికి కూడా అడ్డుపడి రోగి ప్రాణాలకు ప్రమాదంగా మారే అవకాశం ఉందని వైద్యులు వెంటనే శస్త్రచికిత్స చేశారు. ఈ చీముగడ్డ నుంచి దాదాపుగా 300 ఎంఎల్ చీమును తీశామని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. చీముగడ్డను తొలగించి రోగి ప్రాణాలను కాపాడిన వైద్య బృందమైన డాక్టర్ ఆనందచార్య, డాక్టర్ సంపత్‌రావు, డాక్టర్ తణి, డాక్టర్ స్వామి, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ నిఖిల, సీనియర్ అసిస్టెంట్లను, పోస్టు గ్రాడ్యుయేట్లను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్ అభినందించారు.

అర్చన వెంకటేశ్వరరావుకు జీపీ ఆర్ట్స్ జీవిత సాఫల్య పురస్కారం



అర్చన వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న మధుసూదన్

చిక్కడపల్లి: జీపీ ఆర్ట్స్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కళాసుబ్బారావు కళావేదికలో పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు శతజయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయకుడు అర్చన వెంకటేశ్వర్‌రావుకు జీపీ ఆర్ట్స్ జీవనసాఫల్య పురస్కారాన్ని అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ న్యాయమూర్తి మధుసూదన్ ఆయనకు పురస్కారాన్ని అందజేశారు. అనంతరం మధుసూదన్ రావు, సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ మాట్లాడుతూ పాటనే శ్వాసగా భావించిన అర్చన వెంకటేశ్వరరావుకు పురస్కారాన్ని ప్రదానంజేయడం అభినందనీయమన్నారు. తొలుత శ్రీనివాసనాయుడు ఆధ్వర్యంలో పాడుతా తీయగా శీర్షికతో నిర్వహించిన సినీసంగీత విభావరి అలరించింది. కార్యక్రమంలో అఖిల, గంటి శైలజ, రామకృష్ణ, శారద, ఉషారాణి, నాగేంద్రరావు, ఎం.స్వర్ణ, ఆర్.జ్యోతి, రజని అచ్యుత, ప్రభాకర్, సుబ్బిరెడ్డి, వేణుగోపాలచారి, శేఖరుడు, బాపిరాజు, తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ బాధితులపై వివక్ష తగదు



కార్యక్రమంలో పాల్గొన్న గాంధీ వైద్యులు, ఏఆర్‌టీ సిబ్బంది

'గాంధీ' సూపరింటెండెంట్ రాజారావు

గాంధీఆస్పత్రి : హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితులపై వివక్ష చూపించవద్దని, వారిలో మనోధైర్యం కల్పించేందుకు కృషి చేయాలని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు కోరారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీ యాంటీ రిట్రివల్ థెరపీ (ఏఆర్‌టీ) సెంటర్‌లో శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సూపరింటెండెంట్ రాజారావు మాట్లాడుతూ గాంధీ ఏఆర్‌టీ సెంటర్‌లో 18,262 మంది ఎయిడ్స్, హెచ్ఐవీ రోగులు తమ పేర్లను నమోదు చేసుకోగా, ప్రస్తుతం 13,289 మందికి డ్రగ్స్, మందులు, వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. గాంధీ ఏఆర్‌టీ సెంటర్ వైద్యులు, సిబ్బంది ఎంతో మెరుగైన వైద్యసేవలు అందించి, రోగుల్లో మానసిక ఆనందాన్ని నింపుతున్నారని, వారి సేవలు అభినందనీయమన్నారు. అనంతరం హెచ్ఐవీ గర్భిణీలు, బాలింతల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్డు, ఫీడింగ్ కార్నర్ రూమ్‌లను సూపరింటెండెంట్ రాజారావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఆర్‌టీ సెంటర్ నోడల్ ఆఫీసర్ ప్రొఫెసర్ వినయ్‌శేఖర్, ఆర్ఎంఓ–1 జయకృష్ణ, రిటైర్డ్ ప్రొఫెసర్ అంబుజ, డాక్టర్ ఐశ్వర్య, రాధికఆరోహి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శత చండీ మహాయాగం

వెంకటేశ్వరనగర్‌కాలనీ: బంజారాహిల్స్ రోడ్ నంబర్–14లోని శ్రీవిజయ గణపతి ఆలయంలో లోక కల్యాణార్థం నిర్వహిస్తున్న శత రుద్ర యాగ సహిత శత చండీ మహా యాగాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. గత నెల 25న ప్రారంభమైన మహాయాగం ఈ నెల 4వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. వేడుకల్లో భాగంగా శుక్రవారం ఉదయం మహాన్యాస పారాయణం, శత చండీ రుద్ర పారాయణం, హోమం, రుద్ర హవనాలు, రాత్రి చంద్రమౌళీశ్వర స్వామికి అభిషేక పూజలను వైభవంగా నిర్వహించారు. ఆయా పూజల్లో పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు.

3, 4 తేదీల్లో 371 ఉర్సు-ఇ-షరీఫ్

జియాగూడ: ఈ నెల 3, 4వ తేదీల్లో జియాగూడలోని కమురేకి గుమ్మద్‌లో 371 ఉర్సు–ఇ–షరీఫ్ వేడుకలను భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు ముతావలి సయ్యద్ నూర్ ఉల్ అంబియా హుస్సేని ఖుదా నుమాయీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం సందల్ కార్యక్రమం, 4న చిరాగన్ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు కొనసాగుతాయని తెలిపారు. చారిత్రాత్మకమైన సయ్యద్ షా మిరాజీ ఖద్మా సాజిదే సయ్యద్ నూరుల్లా ఉస్సేనీ దర్గాలో రెండురోజుల పాటు వేడుకలు జరుగుతాయన్నారు. శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ దర్గాలో ప్రతి సంవత్సరం రెండురోజుల పాటు ఉర్సు వేడుకలు నిర్వహిస్తామన్నారు.

యువకుడు అదృశ్యం



శ్రీనివాస్ (ఫైల్)

చిక్కడపల్లి: కారు డ్రైవర్‌గా పని చేస్తున్న ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సీతయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాగ్‌లింగంపల్లికి చెందిన కనుగడ్డ శ్రీనివాస్ ఒంటరిగా జీవిస్తున్నాడు. గత నెల 3న ఇంట్లో నుంచి వెబయటికి వెళ్లిన అతను తిరిగి రాలేదు. దీంతో అతడి సోదరి లలిత శుక్రవారం చిక్కడపల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గౌలిపురా: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ఎస్.కృష్ణకాంత్ తెలిపిన వివరాల ప్రకారం..చార్మినార్ పంచ్‌మోహల్లా కమాన్ తపాడియా డయాగ్నోస్టిక్ సెంటర్ సమీపంలో గత నెల 27న ఉదయం 8 గంటల సమయంలో 40 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. దీంతో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు అక్కడికి వెళ్లి గుర్తుతెలియని వ్యక్తిని పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. దీంతో పోలీసులకు సమాచారం అందడంతో సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు స్థానికంగా భిక్షాటన చేస్తుండేవాడని పోలీసుల విచారణలో తెలిసింది.

కొంపల్లికి 'ఆర్ట్ గ్యాలరీ' తరలింపు



కొంపల్లిలో ఏర్పాటు చేసిన 'ఆర్ట్ గ్యాలరీ'ని సందర్శించిన డాక్టర్ కె.ధర్మారావు

కాచిగూడ: మేడ్చల్‌లో ఇప్పటి వరకు కొనసాగిన అద్భుత కళాఖండాల 'ఆర్ట్ గ్యాలరీ'ని కొంపల్లిలోని నూతన ప్రాంగణంలోకి మార్చినట్లు సంస్కృతిరత్న డాక్టర్ కె.ధర్మారావు తెలిపారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులతో కలిసి శుక్రవారం ఆర్ట్ గ్యాలరీని సందర్శించారు. అనంతరం బర్కత్‌పురలోని సంస్థ కార్యాలయంలో మాట్లాడుతూ అద్భుత కమల హస్త కళాఖండాల భాండాగారం (ఆర్ట్ గ్యాలరీ) ప్రపంచ తెలుగు ప్రజలను అబ్బురపరుస్తోందన్నారు. 11 ప్రపంచ రికార్డుల గ్రహీత, హస్తకళాకారిణి ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ పి.కమల ప్రసాదరావును అభినందించారు. కార్యక్రమంలో రసమయి డాక్టర్ యం.కె.రాము, వంశీ రామరాజు, మహ్మద్ రఫీ, అమరకాంత రెడ్డి, సారిపల్లి కొండలరావు, డాక్టర్ ప్రసాద్ తోటకూర, కల్పన శ్రీకళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ క్రీడాకారిణికి సత్కారం



తేజస్వీని సత్కరిస్తున్న రిటైర్డ్ జడ్జి జస్టిస్ వామన్‌రావు తదితరులు

కాచిగూడ: ఫెన్సింగ్ క్రీడలో రాణిస్తున్న చిన్నారి తేజస్వీగౌడ్‌ను రిటైర్డ్ జడ్జి జస్టిస్ వామన్‌రావు సత్కరించారు. తెలంగాణ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చిన్నారిని సత్కరించినట్లు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ్ ముదిరాజ్ తెలిపారు. కార్యక్రమంలో జస్టిస్ పీఎస్ నారాయణ, జస్టిస్ ఎం.వెంకటేశ్వర్ రెడ్డి, జస్టిస్ చంద్రయ్య, తేజస్వీని తల్లిదండ్రులు ఏ.భార్గవి గౌడ్, నాగరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'దృష్టికోణ్' విజ్ఞాన ప్రదర్శన



ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు ప్రదర్శించిన మ్యాథమెటిక్స్ హౌజ్

లాలాపేట: శాంతినగర్‌లోని తక్షశిలా హైస్కూల్‌లో 'దృష్టికోణ్' పేరుతో శుక్రవారం నిర్వహించిన విజ్ఞాన శాస్త్ర ప్రదర్శిన ఆహుతులను ఆలోచింపజేసింది. అసోసియేషన్ ఆఫ్ అకౌంటింగ్ టెక్నిషియన్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా కలకత్తా డైరెక్టర్ డాక్టర్ కేవీ అచలపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రదర్శనలో విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిట్లను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి ప్రదర్శనల ఏర్పాటు వలన విద్యార్థుల్లోని ప్రతిభ, సృజనాత్మకత పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన రోబోటిక్స్ ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ భాగ్యలక్ష్మీ, హెచ్ ఆర్ భాను, ప్రిన్సిపాల్ తనుప్రీత్, వైస్ ప్రిన్సిపాల్ మహిపాల్, హెచ్‌ఎం నాజ్మా తదితరులున్నారు.